## క్లుప్తంగా

### తోటాడలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

మునగపాక: పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామంలో డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోతున్న సిల్టు తొలగింపు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. గ్రామంలో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ,వార్డు సభ్యుడు బుద్ధ రమేష్‌నాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### వలంటీర్ సేవాభావం



సుబ్బన్నకు పింఛన్ అందజేస్తున్న మూలపేట వలంటీర్ దేవి

మునగపాక: మండలంలోని మూలపేటకు చెందిన వలంటీర్ దేవి తన సేవా గుణాన్ని చాటుకున్నారు. మూలపేటకు చెందిన భీశెట్టి సుబ్బన్న సూరి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ అనకాపల్లిలో ఉంటున్న కుమారుని ఇంటి వద్ద ఆశ్రయం పొందుతున్నారు. దీంతో ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛన్ రూ.3వేలను వలంటీర్ దేవి మంగళవారం అక్కడికి వెళ్లి సుబ్బన్నకు అందజేశారు. దీంతో వలంటీర్ సేవల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అక్రమంగా పైపులైను ఏర్పాటు



చెరువుగట్టును తవ్వి పైపులైను ఏర్పాటు చేసిన దృశ్యం

ఎస్.రాయవరం : గుర్రాజుపేటలో గ్రామాల్లో చెరువు గట్టును తవ్వి అక్రమంగా పైపు ఏర్పాటు చేసుకుని ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు నేలలో కప్పుతున్నారని గ్రామానికి చెందిన రైతు కలిదిండి వెంకటపతిరాజు ఇరిగేషన్ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో కొందమంది భూస్వాములు చెరువులో అక్రమంగా విద్యుత్ మోటార్లు పెట్టుకుని నీటిని తోడుకుంటున్నారని, అదీ చాలక ఇప్పుడు చెరువు గట్టును సైతం తవ్వి మరికొన్ని పైపులైన్లు ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. చెరువు గట్టు బలహీన పడితే వరద వల్ల పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, దీనిపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

### పాఠశాలకు మొక్కలు, పుస్తకాల వితరణ



మొక్కలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మునగపాక దలితవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శివకోటి దుర్గా ప్రసాద్ కోరారు. నాగులాపల్లి చంద్రశేఖర్ పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు సుజాత తన తల్లి జ్ఞాపకార్థం మంగళవారం 20 క్రొటాన్ మొక్కలు, విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పిరమిడ్ కేంద్రం అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. పీఎంసీ చైర్మన్ ఎం.లక్ష్మి, వైస్ చైర్మన్ మోహనరావు, ఉపాధ్యాయులు సూరప్పారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### చదువులో వెనుకబడిన వారిపై దృష్టి సారించాలి

మునగపాక : చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని అభ్యాసన అభివృద్ధి కార్యక్రమ మండల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు కోరారు. అభ్యాసన అభివృద్ధి కార్యక్రమం(లిప్)లో భాగంగా మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో లిప్ కార్యక్రమాన్ని తరగతుల వారీగా పరిశీలన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో శంకరరావు, సీఆర్పీ నూకే, అభ్యసన ఉపాధ్యాయులు రమేష్, భాస్కరరావు, చిన్నారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# గురుకులం పిలుస్తోంది



సీబీఎస్ఈ విధానంలో 9వ తరగతి బాలికలకు బోధన

- ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు
- సీబీఎస్ఈ విధానంలో బోధన, నకల సౌకర్యాలతో ఉచిత విద్య
- 23న వరకూ దరఖాస్తుల స్వీకరణకు గడువు



కొక్కిరాపల్లి అంబేడ్కర్ గురుకులం



యోగా చేస్తున్న విద్యార్థినులు

యలమంచిలి రూరల్ : పేద,మధ్య తరగతి వర్గాల్లోని ఎస్సీ,ఎస్టీ,బీసీ, ఈబీసీ విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతి,ఇంటర్మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. కార్పొరేట్ తరహాలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 23 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఒకసారి సీటు పొందితే వసతితో పాటు ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా చదువుకునే అవకాశం కలుగుతుంది. ఇంగ్లిష్ మీడియం బోధనతో పాటు, నీట్, ఐఐటీలో శిక్షణ ఇస్తారు. విద్యార్థులు మార్చి 10వ తేదీన జరిగే కామన్ టాలెంట్ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు. యలమంచిలి నియోజకవర్గానికి సంబంధించి యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి గ్రామానికి సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారి పక్కన డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 5వ తరగతికి 80 సీట్లు, జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు 40 సీట్ల చొప్పున 80 ఉన్నాయి. ఈ గురుకులంలో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం, సీబీఎస్ఈ విధానంలో బోధన, ఆటలు, ఎరోబిక్స్,యోగా ఉంటుంది. ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసేటప్పుడు నీట్, ఐఐటీ శిక్షణలో దేనిని తీసుకుంటారో ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్వహించే కామన్ పరీక్షలకు హాజరై ప్రతిభ చూపితే రాష్ట్ర స్థాయిలో ప్రతిభా పరీక్షలకు పంపుతారు.

**ఇవీ అర్హతలు..**

5వ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, ఎస్సీ, కన్వర్టడ్ క్రిస్టియన్ (బీసీ-సీ) విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించినవారై ఉండాలి. జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు 2023-24 ఏడాదిలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న వారు అర్హులు. వీరి వయస్సు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు దాటకూడదు. డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులం, సాంఘిక సంక్షే వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఏడాది వయస్సు సడలింపు ఉంటుంది. విద్యార్థులు తమ సొంత జిల్లాలో 2022-23 ఏడాదిలో 3వ తరగతి, 2023-24లో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలి. 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షకు దాటకూడదు.

**ప్రవేశ పరీక్ష షెడ్యూల్**

5వ తరగతి ప్రవేశ పరీక్ష 2024 మార్చి10 వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12గంటలు వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష 2024 మార్చి 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఉంటుంది.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి...**

ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 23వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థి 5వ తరగతిలో చేరుటకు ఎంచుకున్న పాఠశాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి. విద్యార్థులు తమ దగ్గరలోని ఏదైనా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా కాని లేదా సమీపంలో ఉన్న డా. బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఏర్పాటు చేయబడిన సహాయ కేంద్రం ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోవడానికి ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఒక్కసారి దరఖాస్తు ఆన్‌లైన్‌లో పూర్తిచేసిన తర్వాత ఎటువంటి మార్పులకు అవకాశం ఉండదు. ఏదైనా వివరాలు, సందేహాలు నివృత్తి కోసం ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్లు లేదా జిల్లా సమన్వయ అధికారులకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

**మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు**



ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న బాలురు, బాలికలకు మార్చి 10 న నిర్వహించే ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయింపు ఉంటుంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. అర్హులైన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలి. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని సౌకర్యాలతో ఉచిత విద్యనందిస్తున్నాం. మా పాఠశాలలో సీబీఎస్ఈ విధానంలో బోధన ఉంటుంది.

– మళ్ల మాణిక్యం, ప్రిన్సిపాల్, కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం

### పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు



తహసీల్దార్ అప్పలస్వామి

రాంబిల్లి : వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలో ఏర్పాట్లు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.అప్పలస్వామి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా తాను రాంబిల్లి తహసీల్దార్‌గా రావడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలు, మౌలిక సదుపాయాలు, ఓటరు జాబితాలు ఇతర ఎన్నికల ప్రక్రియ విధుల్లో నిమగ్నమయ్యామని పేర్కొన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలుంటే తమను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

### సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న తూర్పుకాపు సంఘ ప్రతినిధులు

కోటవురట్ల : తూర్పుకాపుల సంక్షేమానికి అంతా ఐక్యంగా పోరాడాలని తూర్పు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కరణం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో తూర్పు కాపు సంఘ ప్రతినిధులు మంగళవారం సమావేశమయ్యారు. సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడుగా సుంకర బాబ్జీ, ప్రధాన కార్యదర్శిగా అయ్యపురెడ్డి బాబ్జీ, ఉపాధ్యక్షుడుగా బాలేపల్లి ఏసులను ఎన్నుకున్నారు. అనంతరం తహసీల్దారు వెంకరటమణకు తూర్పు కాపులకు బీసీ డి సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

## పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు



శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు అన్నారు. జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఎస్.రాయవరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల నలుమూల నుంచి పార్టీ నాయకులు వచ్చి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొలిశెట్టి గోవిందరావు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి మండలశాఖ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కొణతాల శ్రీనివాసరావుకి జిల్లా కమిటీ కార్యదర్శిగా పదవులు ఇచ్చి గుర్తించారన్నారు. శ్రీనివాసరావు భార్యకు గవర కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చి గౌరవించారన్నారు. కష్టపడ్డ వారికి నిత్యం పైనుంచి అభినందనలు వస్తున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, పోచిన నరేష్, నల్లపరాజు వెంకటరాజు, చొప్పా రాజు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సర్పంచ్‌లు పాలపర్తి పాపారావు, శానాపతి శ్రీరాములు, ధూళి శ్రీనుబాబు, గాడి అప్పలనరసింహ, మైలపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు పుట్టా సుధాకర్, మధువర్మ, ఆదిమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు వరహాలరావు, కర్రి శ్రీనుబాబు, చోడిపల్లి కోదండ, నారాయణరావు పాల్గొన్నారు.

## ఘనంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం



గోకులపాడులో అభయాంజనేయస్వామిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఉత్సవాన్ని పురస్కరించుకుని మహిళల కోలాటం

ఎస్.రాయవరం : గోకులపాడు గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామికి వేకువ జామునుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు తదితరులు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. మహిళలు కోలాటం నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో భారీ మందుగుండు సామాగ్రిని వెలిగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## రైతులకు వ్యవసాయేతర రుణాలు

- కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు
- బీమాచెక్కుల పంపిణీ



బీమా చెక్కు అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు

యలమంచిలి : కొక్కిరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయేతర రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పీఏసీఎస్‌లో వ్యవసాయం కొరకు రుణాలు పొంది ఇటీవలే మరణించిన ఇద్దరు రైతుల కుటుంబ సభ్యులకు జనతా ఇన్సూరెన్స్ బీమా చెక్కులు 45 వేల రూపాయలు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయేతర రుణాలు అందిస్తున్నదని, వ్యవసాయ రుణాలను పొందిన రైతులకు బీమా ద్వారా ఆర్థిక సహాయం చేకూరుతుందని, రైతులందరూ సకాలంలో రుణాలు చెల్లించి, సంఘం నుంచి సబ్సిడీతో కూడిన రుణాలను మరలా పొందాలని అన్నారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు, పందిరి రాంబాబు, యర్రంశెట్టి చిన్నాబ్బాయి, సీఈవో మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

## 9న మరిడిమాంబ సారె ఊరేగింపు

అనకాపల్లి : నిక విజయరామరాజుపేట శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 9వ తేదీన అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఆలయ చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ అన్నారు. ఆలయ ఆవరణలో సారె ఊరేగింపు గోడపత్రికలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతీ ఏడాది మాదిరిగానే పట్టణంలో పురవీధులు గుండా అమ్మవారి సారె ఊరేగింపు జరుగుతుందన్నారు. వివిధ రకాలైన పిండివంటకాలు మహిళలు తయారుచేసి ఊరేగింపులో పాల్గొని, అనంతరం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, భక్తులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

### ఘనంగా బండారమ్మ తీర్థం

కశింకోట : మండలంలోని తేగాడలో బండారమ్మ తల్లి తీర్థ మహోత్సవం మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని పూలమాలలు, నిమ్మకాయల దండలు, నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## ప్రజల ఆరోగ్యానికి సంజీవనిలా వైద్య శిబిరాలు

లైనుకొత్తూరులో జగనన్న ఆరోగ్య శిబిరం



ఆరోగ్య సురక్షలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు త్రినాథ్, ఎంపీడీవో అప్పలనాయుడు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



మునగపాకలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

యలమంచిలి : ప్రజల ఆరోగ్యానికి గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు సంజీవనిలా పని చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ అన్నారు. లైనుకొత్తూరు గ్రామ సచివాలయంలో మంగళవారం ఉదయం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ఎంపీడీవో అప్పలనాయుడుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా శత శాతం ప్రజలు తమ ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకోగలిగారని, పేద, మధ్య తరగతి ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ ద్వారా వారి ఆరోగ్య సమస్యలు, కుటుంబ వివరాలు నమోదు చేసి వారికి వైద్యుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు ఉచితంగా మందులు అందజేస్తోందని, ఇంకా ఉన్నత చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా పెద్దాసుపత్రులకు రిఫర్ చేయడం జరుగుతోందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ , రక్త నమూనాల పరీక్ష, ఈసీజీ, కళ్ల పరీక్షలకు చెవి, ముక్కు, గొంతు, స్త్రీలకు గైనిక్ సమస్యల పరిష్కారానికి సచివాలయం ఆవరణలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి రజని, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి భర్త ఏటికొప్పాక మేజర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ అన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరాల్లో 140 రకాల మందులు అందుబాటులో ఉండడంతో పాటు నిష్ణాతులైన వైద్యులు సేవలందిస్తున్నారన్నారు. రోగులకు కేస్ షీట్‌లు అందజేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాశీబాబు, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్, పార్టీ నేతలు అప్పారావు, సంతోష్‌కుమార్, వైద్యాధికారి విమలగిరి పాల్గొన్నారు.

### 380 మందికి ఉచిత వైద్య సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య బృందంతో ఎంపీడీవో స్వప్న

పాయకరావుపేట : సత్యవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 380 మందికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరైన రోగులకు వైద్యులు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. గుండె సమస్యలు వున్నవారికి ఈసీసీ, నిర్వహించారు. స్త్రీలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.స్వప్న వైద్య శిబిరాన్ని పరిశీలించి, వైద్యులతో వైద్య పరీక్షలు, రోగుల హాజరుపై అడిగి తెలుసుకున్నారు. వైద్యులు డాక్టర్ ఎన్.సంకీర్తన, డాక్టర్ కె.రవికిరణ్, ఎ.జయలక్ష్మి రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ చంద్రశేఖర్, మంగవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శ్రీనివాస్, సత్యవరం సర్పంచ్ సకిలేటి రాము పాల్గొన్నారు.

## ముమ్మరంగా స్థల రిజిస్ట్రేషన్లు



ఎంపీడీవో వెంకటాచలం

రాంబిల్లి: మండలంలో 17 గ్రామ సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఎస్.వెంకటాచలం తెలిపారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ, జగనన్న లేఅవుట్లలో లబ్ధి దారులకు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన స్థలాలపై సంపూర్ణ హక్కు కల్పించేందుకు ఆయా గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నామన్నారు. 1051 స్థలాలు రిజిస్ట్రేషన్లు చేయాల్సి వుండగా వాటిలో 821 స్థలాలు ఆన్‌లైన్ అయ్యాయన్నారు. వీటిలో 498 స్థలాలు రిజిస్ట్రేషన్లు చేయడం జరిగిందన్నారు. బుధ లేదా గురువారం నాటికి శత శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఎంపీడీవో పేర్కొన్నారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ, ఆయుస్మాన్ హెల్త్ కార్డులను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా అందజేస్తున్నామన్నారు.

ఎస్.రాయవరం : గ్రామ సచివాలయాల్లో జోరుగా జగనన్న ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ జరుగుతోంది. ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక గ్రామాల్లో వందల కొలదీ లబ్ధిదారులు ఇళ్ల స్థలాలు పట్టాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. వాటిల్లో 80 శాతం లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. వారికి ప్రభుత్వం ఇళ్ల స్కీమ్ కూడా అందజేసింది. వారికి ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ, నేరుగా సచివాలయాల్లో ఉచిత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. దీంతో లబ్ధిదారులు పెద్ద ఎత్తున సచివాలయాలకు తరలివెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు.



పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

**చురుగ్గా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు**

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామ సచివాలయాల్లో జగనన్న ఇళ్ల కాలనీలల ఇంటి పట్టాలను చురుగ్గా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. మండలంలో గల 24 గ్రామాల పరిధిలోను ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్‌లు చేసి సిబ్బంది అందిస్తున్నారు. మండలంలో 2950 మందికి పట్టాలు పంపిణీ చేశారు. పాయకరావుపేట పట్టణంలో గల లబ్ధిదారులకు పీఎల్ పురం గ్రామ రెవెన్యూ పరిధిలో 1250 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు. వీరందరికీ పీఎల్ పురం గ్రామ సచివాలయంలోను, పాయకరావుపేట నంబరు వన్ గ్రామ సచివాలయంలోను పట్టాలు రిజిస్ట్రేషన్ సిబ్బంది చురుగ్గా చేపడుతున్నారు. ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ మండలంలో గల ఆయా గ్రామ సచివాలయాల్లో పట్టా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు.

### రోడ్డు మరమ్మతులపై నేడు రౌండ్ టేబుల్ సమావేశం

మునగపాక : అచ్యుతాపురం నుంచి అనకాపల్లికి వెళ్లే రోడ్డును బాగు చేయాలని కోరుతూ బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు సీపీఎం నేతలు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొంత కాలంగా పూడిమడక రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. రహదారిపై గోతులు పెరిగిపోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారన్నారు. దీనికి తోడు పరిమితికి మించి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ కార్యాచరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఉదయం 10గంటలకు మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో జరిగే సమావేశానికి రాజకీయాలకు అతీతంగా హాజరుకావాలన్నారు. రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ పాల్గొన్నారు.

### ఘనంగా జువ్వాలమ్మ తల్లి పండగ

మునగపాక : గంటవానిపాలెంలో మంగళవారం జువ్వాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పండగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.